

22ND ANNIVERSARY

# నేటిధాత్రి ®
తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

మంగళవారం 21-04-2026 పేజీలు : 8 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 22 రూ॥ 6.00





చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


# మెదడుందనుకునే మేధావులు!
# అందరికీ మేత పెడుతుంటారు!?

- వారికి తోచిందే గొప్పనుకుంటారు!?
- మనసులో ఒకటి, బైటకు ఒకటి చెబుతారు!
- వారి నాలుకను ఎటైనా తిప్పేస్తుంటారు!
- రాజకీయ పండితులుగా చెలామణి అవుతుంటారు!
- నాలుగు పుస్తకాలు చదివి విజ్ఞాన గనులనుకుంటారు!
- సమాజానికి పాఠాలు చెబుతారు.. గుణపాఠాలు చెబుతుంటారు!



- వాళ్ళ మాటలను లెక్క చేయని వారిని దూషిస్తుంటారు!
- కళ్ళ ముందు నిజాలను సమాధి చేస్తుంటారు.
- వ్యవస్థ మా వల్లనే ముందుకు సాగుతుందనుకుంటారు.
- వాళ్ళు లేకపోతే సమాజం ఏమైపోయేదో అనుకుంటారు.

## రాజకీయాలు, మీడియా తమ చుట్టూ తిరగాలని కోరుకుంటారు
## అసత్య ప్రచార యావ వున్న మేధావులు చౌక్కానలగనంత గొప్పగా బతుకుతుంటారు

- వాళ్ళనుకున్నది జరిగితే విజయం మాదే అని జబ్బలు చర్చుకుంటారు.
- అల్లులవలే అవార్డులకు పొంగిపోతారు.
- అబద్దాల ముసుగేసుకొని ఊరేగుతుంటారు.
- కాలాన్ని బట్టి మనసు మార్చుకుంటారు!
- ఎప్పటికప్పుడు వాళ్ళు చెప్పిందే నిజమనుకుంటారు!
- కాలం మారితే అన్ని పరిస్థితులు మారవు!
- కాలాన్ని బట్టి మనిషి మారకపోతే బతకలేడు!
- సామాన్యుడి పక్షాన నిలిచినట్లు నటిస్తుంటారు.
- నెత్తిన పెట్టుకునే వారి పల్లకి మోస్తుంటారు.
- నెత్తిన పెట్టుకోకపోతే నిందలేస్తూ కాలం గడుపుతుంటారు.
- ఒక్క మాటలో చెప్పాలంటే వారి వల్ల సమాజానికి పైసా లాభం వుండదు.
- పేద వారి గురించి మాట్లాడుతూ కారు దిగలేనంత గొప్పగా బతుకుతుంటారు.
- నిజమైన మేధావులు అర్ధకాలితో మాడిపోతుంటారు.
- ఎందరో అసలైన మేధావులను ఆకలి కబలించింది.
- అబద్దాల మేధావులకు విలాసం తోడుగా నిలుస్తోంది.

**హైదరాబాద్, నేటిధాత్రి:**

మేధావులు, మేథావులు అని పెద్దలు ఊరికే అనలేదు. వారిని విశ్లేషించడంలో కూడా మేధావులు, సూడో మేధావులు అని కూడా మన పెద్దలే సెలవిచ్చారు. అందుకే ఎవరు మేదావులో, ఎవరు సూడోమేధావులో కూడా అర్దం చేసుకోవాల్సిన అసవరం వుంది. నిజం చెప్పాలంటే మేదావులు అనేవారు కనకంలా వుంటారు. కాని బతుకంతా నరకంగా వుంటుంది. సూడో మేదావులు కంచులా వుంటారు. బతుకంతా సప్పుడుతో కళకళలా డుతుంది. ఇప్పుడున్న మేధావులు అనే పిలువబడే వారిలో అసలై మేధావులు ఎక్కడున్నారో కూడా బూతద్దం పెట్టినా వెతికినా కనించరు. ఎందుకంటే ఈ సూడో మేదావుల ముందు తమను తాము తక్కువ చేసుకోలేక, ఆత్మాభిమానం చంపుకోలేక వాళ్లు బైటకు రావడం లేదు. కాని సూడోమేధావులు ఎప్పుడూ జనంలోనే వుంటారు. కాని జనం మమేకమైనట్లు కనిపిస్తారు.కాని జనం వేరు, తాము వేరు అనే ముసుగులో వుంటారు. ఇది నిజం. ఇదే నిజం. ఎందుకంటే తమకు వ్యక్తి తెలుసు. వ్యక్తిత్వం తెలుసు. వ్యక్తులు తెలుసు. సమాజం తెలుసు. వ్యవస్థలు తెలుసు. అన్నీ తెలుసు. మాకు మాత్రమే అన్ని తెలుసున్న భ్రమల్లో వుంటారు. మేధావులుగా చెలామణి అవుతుంటారు. మిగతా వాళ్లను అమాయకులు అంటూ సంబోధిస్తూ పరోక్షంగా ప్రజలందరికీ ఏమీ తెలియన్న భావనలో వుంటారు. సామాన్యుడికన్నా మేధావి ఎవరూ వుండరు. వారి ఆలోచనలు ఆకాశాన్ని దాటి పోయేంతగొప్పగా వుంటాయి. కాని వారి మాటలు ఎవరూ వినరు. నమ్మరు. ఎందుకంటే వారికి చదువు వుండదు. మన సమాజంలో ఆకలిగా వుందనే వారిని చీ పొమ్మంటారు. అడుక్కుతినేవాళ్లు ఎక్కువయ్యారని చీదరించకుంటారు. అదే మేధావి ముసుగులో వున్న వారు సమాజం అకలితో వుంది. వ్యవస్థ ఆకలితో అల్లాడిపోతోంది. మన చుట్టూ ఎంతో మంది అర్థాకలితో జీవిస్తున్నారు. అని చెప్పే వాడిని మాత్రం మేధావి అని గౌరవిస్తారు. ఆకలిగొన్న వాడికి పట్టెడన్నం ఏనాడు పెట్టని వాడు కూడా పేద వారి ఆకలి గురించి మాట్లాడితే మేదావి అవుతాడు. ఇదీ మేదావుల అసలు రూపం. మేదావి ముసుగులో వున్నవాళ్లలో ఎక్కువ శాతం విద్యావంతులు. ఉన్నత ఉద్యోగాలు చేసేవారు. లక్షల రూపాయాల జీతాలు తీసుకునేవారు. వాళ్లు సమాజం గురించి మాట్లాడుతుంటే అందరూ వినాలనుకుంటారు. కాని లక్షల రూపాయలు జీతాలు తీసుకునే మేధావులు ఎవ్వరూ మానవత్వం వున్నవాళ్లు కాదు. వారికి అందే జీతంలో కొంత భాగం పేదల కోసం ఖర్చు చేసేవారు కాదు. కాని ప్రభుత్వాలు ఇలా చేయాలి? అలా చేయాలి? అని నీతులు చెబుతుంటారు. సంపన్నుల తమ సంపదను పేదలకు పంచాలని సూచిస్తుంటారు. ప్రభుత్వాలు పేదలను వంచిస్తోంటారు. తాను సమాజంలో ఒక వ్యక్తినే, నేను మానవత్వం చాటుకుంటానని మాత్రం రూపాయి ఇవ్వరు. ఉచిత సలహాలు పారేస్తుంటారు. నిజం చెప్పాలంటే మేధావి ముసుగులో వున్నవారు ఎవరూ నిజాలు చెప్పరు. నిజం మాట్లాడుతున్నామన్న భ్రమల్లో వుంటారు. నోరు తెరిస్తే ఆత్మద్రోహం చేసుకుంటూ అబద్దాలు వల్లిస్తుంటారు. మనసులో ఒకటి వుంటే, బైటకు మరొకటి మాట్లాడుతుంటారు. వారి నాలుకను ఎటువైపైనా తిప్పేస్తుంటారు. ఉమ్మడి తెలంగాణలో ఓ మేదావి తెలంగాణ ఇస్తే మిన్ను విరిగి మీద పడుతుందా? అని ప్రశ్నిస్తూనే విడిపోతే బలం తగ్గుతుందని సన్నాయి నొక్కులు నొక్కారు. ఉమ్మడి రాష్ట్రంలో వున్నప్పుడు అభివృద్ది అంతా ఒక్క హైదరాబాద్‌లో కేంద్రీకృతమైతే మిగతా ప్రాంతాలు అన్యాయానికి గురౌతాయని చెబుతూ వచ్చారు. తర్వాత ఏపి ఏర్పాడిన తర్వాత అమరావతి విషయంలో అదే మాట అన్నారు. తర్వాత మూడు రాజధానులను సమర్ధించారు. ఇప్పుడు మళ్లీ రాజదాని లేకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అంటే ఒకే వ్యక్తి. ఇన్ని రకాల మాటలు మాట్లాడుతూ, ఏ ఎండకు ఆ గొడుగు పడుతుంటారు. ప్రతి యువత గొప్ప ఉద్యోగిని కావాలి. ప్రజా సేవ చేయాలి.తన జీవితం సెటిల్ కావాలని కోరుకుంటారు. వైద్య వృత్తి చదవిన ఆ మేధావి, ఐఏఎస్ అయ్యారు.కాని ఈ తరం యువత సివిల్‌సర్వీసెస్ వైపు వెళ్లడం విడ్డూరమని అంటుంటారు. సివిల్ సర్వీసెస్ చదవి, ప్రజలకు సేవ చేస్తానని ఐఏఎస్ అయ్యి వ్యవస్థ మీద విరక్తితో రాజీనామా చేసి, రాజకీయ నాయకుడయ్యారు. పార్టీ ఏర్పాటు చేశారు. అవినీతి నిర్మూలన చేస్తామన్నారు. కాని ఏమైంది. జనం నమ్మకపోవడంతో మళ్లీ మేధావిగా జనం ముందు తనకు తోచించి చెబుతుంటారు. జనమంతా ఒకటి అనుకుంటుంటే, అందుకు భిన్నంగా మాట్లాడుతూ జనాన్ని తప్పు పడుతుంటారు. తాజాగా మహిళా రిజర్వేషన్, డీ లిమిటేషన్ విషయంలోనూ ఇదే లాజిక్ లేని మాటలు మాట్లాడుతున్నారు. మహిళా బిల్లు తెవాలనుకుంటున్న పార్టీలు గత ఎన్నికల్లో ఎందుకు మహిళలకు సీట్లు ఇవ్వలేదని ప్రశ్నించరు. ఏ ప్రభుత్వం పాలనలో వుంటే ఆ పాలనకు సన్నాయి నొక్కులు నొక్కుతుంటారు. సమాన్యుల మీద పడే భారాలను ఏనాడు ఆ మేధావి ప్రశ్నించరు. ఇలా తెలంగాణలో తిష్టవేసుకున్న మేధావులు చాలా మంది వున్నారు. తెలంగాణకు వరప్రదాయినిగా మారిన కాళేశ్వర నిర్మాణం దండగంటూ వచ్చారు. కాళేశ్వరం తెల్ల ఏనుగన్నారు. కాని ఏనాడు తెలంగాణకు ఉమ్మడి పాలకులు నీళ్లివ్వాలని కోరింది లేదు. మేధావులుగా కోరుకున్నది లేదు. తెలంగాణలో వున్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఆనాడు కోరిన వాళ్లు కాదు. తెలంగాణ వచ్చిన తర్వాత నీళ్లెలా వచ్చాయన్నదానిని గుర్తించరు. కేసిఆర్ నీళ్లెలా ఇచ్చాడన్నదానిపై ప్రజలకు నిజాలు చెప్పరు. తెలంగాణ ఇలా అన్నపూర్ణగా మారడానికి కారణాలు చెప్పడానికి వారికి నోరు రాదు. కాలేశ్వరం మాత్రం పనికి రాదంటూ సూడో మేదావులు చెబుతుంటారు. తెలంగానలో వుంటారు. ఇంకా తెలంగాణ మీద పడి ఏడుస్తారు. తెలంగాణ బాగు పడడం చూడలేరు. తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణలో విద్యా వ్యవస్దకు ఎలాంటి మూల్యాంకనం అవసరమన్నదానిపై కమిటీ వేసి దానికి ఛైర్మన్‌ను చేసి బాద్యతలు అప్పగిస్తే ఆ కర్తవ్యం నిర్వహించిన వాళ్లే విద్యా వ్యవస్థమీద నిత్యం మాట్లాడుతుంటారు. వయో వృద్దులైనా నిజాలు చెప్పడానికి ఏ మాత్రం వెనుకాడకుండా మాట్లాడుతుంటారు. కేసిఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడంటారు. నిజంగా ఎక్కడైనా అవినీతి గత ప్రభుత్వంలో జరిగితే నిలదీయాల్సిందే. నిందించాల్సిందే.ప్రభుత్వాలను సన్మార్గంలో పెట్టాల్సిందే. అంతే కాని వారి మనసులో వున్నదానికి ఎల్ల కాలం కక్కేందుకు కూడా వెనుకాడని సూడో మేదావులు వున్నారు. మొత్తం కేసిఆర్ చేసిన అప్పులపై అటు కేంద్రం, ఇటు కాగ్ అనేక సార్లు చెప్పింది. ప్రస్తుతం రెండు సంవత్సరాల కాలంలో చేసిన అప్పులపై ప్రభుత్వమే స్పష్టత ఇచ్చింది. అయినా సూడో మేధావులు కేసిఆర్ అప్పులు చేశాడని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడని రాజకీయ నాయకులుగా మాట్లాడుతుంటారు. ఆనాడు నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనపై రకరకాల వ్యాఖ్యలు చేశారు. మార్పు రావాలని యువతకు సూచించారు. మరి ఇప్పుడేం చేస్తున్నారు..ఇంకా గత కాలాన్ని గుర్తు చేస్తూ కాలం గడుపుతున్నారు. ఇక తెలంగాణ జాతి పిత మీద లేని పోని వ్యాఖ్యానాలు చేస్తుంటారు. ఎవరికి ఇష్టమొచ్చినట్లు వాళ్ల పేర్లు తెరమీదకు తెస్తారు. ఆఖరుగా కేసిఆర్‌ను నిందిస్తుంటారు. కేసిఆర్ ఏమైనా నేను తెలంగాణ జాతి పితను అని చెప్పారా? అలా పిలవమని కోరారా? నాయకులు, అభిమానులు అలా సంబోధిస్తే కేసిఆర్‌కు ఏం సంబంధం? పైగా తెలంగాణ సకల జనుల సమ్మె వల్లనే వచ్చింది. అది కాదని కేసిఆర్ కూడా ఎప్పుడూ చెప్పలేదు. కాకపోతే కేసిఆర్ చేసిన ఉద్యమం, త్యాగం, ఆమరణ నిరసన దీక్ష లేకుండానే తెలంగాణ ప్రకటన వచ్చిందా? పార్లమెంటు సాక్షిగా ప్రకటన వెలువడిందా? అర్ధరాత్రి స్వతంత్రం వచ్చినట్లు డిసెంబర్ 9న తెలంగాణ అప్పటి కేంద్రం ప్రకటించిందా? తెలంగాణ ప్రకటన వెనక్కి తీసుకుంటే ఐదేళ్లు కేసిఆర్ రకరకాల ఉద్యమ స్వరూపాలను నిర్మాణం చేయలేదా? డిసెంబర్ 9 ప్రకటన మాత్రం కేవలం కేసిఆర్ ఆమరణ దీక్ష వల్ల వచ్చింది కాదా? నిజాన్ని ఒప్పుకోలేరు. మేధావులు ఇచ్చిన నాలుగు ఉపన్యాసాల మూలంగానే తెలంగాణ వచ్చిందా? పత్రికల్లో రాసిన నాలుగు వ్యాసాలతోనే వచ్చిందా? కేవలం ఒక్క రచయితలు, గాయకులతోనే వచ్చిందా? ఒక్క విద్యార్థులు వల్లనే వచ్చిందా? అందరి బాగస్వామ్యం వుంది.కాకపోతే కేసిఆర్ బాగస్వామ్యం సింహభాగం వుంది. అది గుర్తించలేని, చెప్పలేని సూడో మేదావుల మూలంగానే తెలంగాణ అప్పుడైనా, ఎప్పుడైనా జఠిలమైంది. కేసిఆర్ మూలంగానే తెలంగాణ కల సాకారమైంది. అంతిమంగా కాంగ్రెస్ ఇచ్చింది. కాంగ్రెస్‌లోనూ తెలంగాణ వాదులున్నారు. వాళ్లు కూడా గట్టిగానే కొట్లాడారు. వారి శక్తికి మించి కొట్లాడిన వాళ్లు కూడా వున్నారు. వారిని పోరాటాన్ని ఎవరూ తక్కువ చేయడంలేదు. కాని ఈ మధ్యలేనిపోని వివాదాలు సృష్టించేది కూడా ఈ సూడో మేధావులే.




# గీసుకొండ మండలంలో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

▶▶నలుగురు అరెస్ట్ -- ఇద్దరు పరారీ -- నగదు, సెల్‌ఫోన్లు, బైకులు స్వాధీనం.... ▶▶వివరాలు వెల్లడించిన సీఐ విశ్వేశ్వర్...



**గీసుకొండ, నేటిధాత్రి:** వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో పేకాట శిబిరంపై స్థానిక పోలీసులు,టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు, మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.గీసుకొండ సీఐ విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం గీసుకొండ పోలీసులు,వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 19 న కొమ్మాల గ్రామ శివారులో కడారి రాజు వ్యవసాయ భూమి వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు అక్కడి నుంచి పరారయ్యారు.అరెస్టైన వారిలో అదే మండలం కొమ్మాల గ్రామానికి చెందిన కడారి రాజు,బసికే ప్రభాకర్, విశ్వనాధపురానికి చెందిన దునికే కొమురయ్య,లకావత్ గణేష్ ఉన్నారు. కాగా విశ్వనాధపురానికి చెందిన వాంకుడోత్ రాజు,కొమ్మాల గ్రామానికి చెందిన పల్లె నరేష్ ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు సిఐ తెలిపారు.పట్టుబడిన వారి వద్ద నుంచి రూ. 4,840 నగదు, 5 సెల్‌ఫోన్లు, 4 మోటార్ సైకిళ్లు మరియు పేకాట ముక్కలు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు గీసుకొండ ఇన్స్పెక్టర్ విశ్వేశ్వర్ తెలిపారు.

# వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

▶▶డాన్స్ మాస్టర్ రాపర్తి పవన్....



**భూపాలపల్లి, నేటిధాత్రి:** పాఠశాల విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ గణేష్ తారా డాన్స్ అకాడమీ మాస్టర్ రాపర్తి పవన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను వృధా చేయకుండా, మొబైల్ ఫోన్ లకు పరిమితం కాకుండా ఆసక్తి గల కళలు నేర్చుకొని సెలవులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అందులో భాగముగా తమ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ నుండి 60 రోజుల మెగా సమ్మర్ డాన్స్ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అందరికి అందుబాటులో ఉండే ఫీజుతో తరగతుల నిర్వహణ ఉంటుందని ఆసక్తి గల విద్యార్థులు 8978789842 సెల్ నెంబర్ లో సంప్రదించవచ్చని ఈ సందర్భంగా పవన్ తెలిపారు.

# అగ్నిమాపక సేవల వారోత్సవం ఘన ముగింపు



**పరకాల, నేటిధాత్రి:** ప్రాంతంలో ఏప్రిల్ 14 నుండి 20 వరకు నిర్వహించిన అగ్నిమాపక సేవల వారోత్సవం సోమవారం విజయవంతంగా ముగిసింది.అగ్ని ప్రమాదాల నివారణ,అప్రమత్తత, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ వారోత్సవం ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు.ముగింపు కార్యక్రమానికి సంతోష్ నర్సింగ్ హోమ్‌కు చెందిన డాక్టర్ డా.సంతోష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అగ్ని ప్రమాదాల సమయంలో తక్షణ స్పందన ఎంతో కీలకమని,ప్రాథమిక చికిత్సపై అవగాహన ఉండటం ద్వారా ప్రాణనష్టం తగ్గించవచ్చని ఆయన తెలిపారు.ప్రజల్లో చైతన్యం పెంచడంలో అగ్నిమాపక శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు.



వారోత్సవంలో భాగంగా ప్రతిరోజూ వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ప్రారంభ దినాన ర్యాలీలు,ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టగా,తరువాతి రోజుల్లో పర్కల్ బస్ స్టాండ్,సాగర వీధి వంటి ప్రాంతాల్లో ప్రజలకు అగ్ని భద్రతపై సూచనలు అందించారు.సంతోష్ నర్సింగ్ హోమ్ మరియు వినూత్న న్యూరో ఉ జనరల్ హాస్పిటల్‌లలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించగా, శ్రీ బాలాజీ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు.జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మాక్ డ్రిల్ ద్వారా అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలను ప్రదర్శించారు.ముగింపు రోజున సన్మానాలు నిర్వహించి కార్యక్రమాన్ని ముగించారు.అగ్ని ప్రమాదాల సమయంలో వెంటనే 8712699306 నంబర్ ద్వారా అగ్నిమాపక అత్యవసర సేవలను సంప్రదించాలని అధికారులు సూచించారు.ఈ వారోత్సవం ద్వారా ప్రజల్లో అగ్ని భద్రతపై అవగాహన మరింత పెరిగినట్లు అధికారులు తెలిపారు.

# ప్లాస్టిక్ పేపర్ ప్లేట్ల వాడకంపై అప్రమత్తంగా ఉండాలి

▶▶జి. ఎం. పి. ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నల్లబెట్ట చిన్న రాజు యాదవ్



**అయినవోలు, నేటిధాత్రి:** హనుమకొండ జిల్లా అయినవోలు మండల కేంద్రంలో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం జి. ఎం. పి. ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నల్లబెట్ట చిన్న రాజు యాదవ్ అన్నారు.. ఈ రోజుల్లో ఫంక్షన్ హాళ్లలో ప్లాస్టిక్ పేపర్ ప్లేట్లలో వేడి ఆహారం వడ్డించడం వల్ల ప్రమాదకరమైన విషపదార్థాలు విడుదలై, మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన హెచ్చరించారు. దీని వల్ల తెలియకుండానే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా, వాడిన ప్లాస్టిక్ ప్లేట్లు బయట పారేయడం వల్ల వాటిని గొర్రెలు, మేకలు తిని జీర్ణం చేసుకోలేక మరణిస్తున్నాయని తెలిపారు. ఇటీవల నక్కకట్టయ్య, ముడికా బాలకొమురయ్య, నల్లబెట్ట కొమురయ్యలకు చెందిన గొర్రెలు పెద్ద సంఖ్యలో చనిపోయిన ఘటనలను ఆయన ప్రస్తావించారు.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, స్టీల్ ప్లేట్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ప్రతి ఫంక్షన్‌లో స్టీల్ ప్లేట్లు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వల్ల పశువులకు మాత్రమే కాకుండా భూమి సారానికి కూడా నష్టం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టకపోతే రాబోయే తరాలకు ప్రమాదం తప్పదని హెచ్చరిస్తూ, ప్రభుత్వాలు మరియు స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# నాగారంలో పరుపుతాళ్లకు బలే గిరాకి



**పరకాల, నేటిధాత్రి:** పరకాల మండలపరిధిలోని నాగారం గ్రామంలో పరుపుతాడు కల్లు(తాటికల్లు)కు గణనీయమైన డిమాండ్ నెలకొంది.వేసవి కాలం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ సహజ పానీయానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ పరిసరాల నుంచి కూడా వినియోగదారులు పెద్ద సంఖ్యలో పరుపుతాళ్ల వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రత్యేకించి ఉదయం,సాయంత్రం వేళల్లో పరుపుతాళ్ల వద్ద సందడినెలకొంటోంది. రైతులు,కూలీలు,యువతతో పాటు వృద్ధులు కూడా ఈ పానీయాన్ని ఆస్వాదించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



శరీరానికి చల్లదనం అందించడం, అలసటను తగ్గించడం వంటి లక్షణాల వల్ల ఇది వేసవిలో సహజ శీతల పానీయంగా మంచి గుర్తింపు పొందింది.తాటి చెట్ల నుంచి తాజాగా సేకరించే కల్లు ప్రత్యేక రుచి, సహజత్వం కారణంగా వినియోగదారులను ఆకట్టుకుంటోంది.మార్కెట్‌లో లభించే ఇతర పానీయాలతో పోలిస్తే ఇది సహజమైనదిగా భావించడంతో డిమాండ్ మరింత పెరుగుతోంది.
దీంతో పరుపుతాళ్ల వద్ద విక్రయాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి.
ఈ డిమాండ్ పెరుగుదలతో తాటి తాపీలకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కల్లు సేకరణ,విక్రయాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం పెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే రోజువారీగా పెద్ద ఎత్తున విక్రయాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.మొత్తంగా,పరకాల పరిధిలో పరుపుతాళ్లకు పెరుగుతున్న గిరాకి గ్రామీణ జీవనశైలిలో భాగమైన ఈ సంప్రదాయ పానీయానికి తిరిగి ప్రాధాన్యం తీసుకువస్తూ,స్థానికులకు ఆదాయం అందించే ముఖ్య వనరుగా మారుతోంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతు బీర్,బ్రాందీ లకంటే స్వచ్ఛమైన తాటికల్లే ఆరోగ్యకరమని తెలిపారు.

# ప్రత్యేకఅవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ వరం




▶▶ఫిజియోథెరపీ వైద్యులు సిహెచ్ రమేష్

**మొగుళ్ళపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల జెడ్పి హెచ్ఎస్ మొగుళ్ళపల్లి భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు గౌరవ మండల విద్యాశాఖ అధికారి శ్రీ లింగాల కుమారస్వామి ఆదేశాల మేరకు నిర్వచించారు ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల శారీరక వైకల్యాల పక్షపాతం వంటి సమస్యలు ఉన్నవారికి ఈ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు దివ్యాంగ బాలల బాలికల భవిత కేంద్రంలో ఉచిత విజయోతరపి వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు




దివ్యాంగపిల్లలకు ఆట వస్తువులు బోధన సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది . మండలంలోని వివిధ గ్రామాల వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న బాల బాలికల తల్లిదండ్రులు శిబిరానికి తీసుకువచ్చారు అనంతరం పిల్లలకు ఫిజియోథెరపీ చేసి తల్లిదండ్రులకు సలహాలు సూచనలు ఇచ్చారు భవిత కేంద్రంలో ప్రతి సోమవారం బుధవారం ఫిజియోథెరపీ నిర్వహిస్తారుఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం వెంకన్న ప్రవీణ్ బి సదయ్య చిలుక మారి శ్రీనివాస్ తల్లిదండ్రులు పాల్గొన్నారు

# వాటర్ ట్యాంక్ ద్వారా మంచినీటి సరఫరా



**పరకాల, నేటిధాత్రి:** పట్టణంలోని ఒకటో వార్డులో తలెత్తిన నీటి కొరత సమస్యకు తాత్కాలిక పరిష్కారం కల్పించబడింది.ఇటీవల రోజులుగా మంచినీటి లభ్యత లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని,ఒకటో వార్డు కౌన్సిలర్ దుబాసి వెంకటస్వామి చొరవతో వాటర్ ట్యాంక్ ద్వారా మంచినీటి సరఫరా ఏర్పాటు చేయబడింది.ఈ చర్యతో తాత్కాలికంగా నీటి సమస్య కొంతవరకు తగ్గినట్లు స్థానికులు తెలిపారు.సమస్య పరిష్కారానికి స్పందించిన కౌన్సిలర్‌కు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బొచ్చు సతీష్,మంద నరేష్,మేకల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

▶▶సర్పంచ్ ఎడ్ల స్వరూప సుధాకర్



**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండలం హుస్సేన్ పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ ఎడ్లస్వరూ ప- సుధాకర్ పరిశీలించారు. పనుల నాణ్యత, కార్మికుల హాజరు, పని నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు సమ యానికి హాజరై, అప్పగించిన పనులను పూర్తిగా నిర్వహిం చాలని సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం వేళల్లోనే పనులు ముగించుకోవాలని సూచిం చారు. అదేవిధంగా, ప్రతి కార్మి కుడి హాజరు సక్రమంగా నమో దు చేయాలని, పనుల్లో ఎలాం టి నిర్లక్ష్యం ఉండకూడదని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వంఅంది స్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ్ రావు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, మేటు వేణు పాల్గొ న్నారు.

# జమ్మికుంట తహసీల్దార్ గారికి పితృ వియోగం



**జమ్మికుంట, నేటిధాత్రి:** జమ్మికుంట తహసీల్దారుగా పనిచేస్తున్నటువంటి నల్ల వెంకట్ రెడ్డి తండ్రి నల్ల నారాయణరెడ్డి 20.4.2026 సోమవారం రోజున ఉదయం 1.30 నిమిషాలకు పరమపదించారు తాసిల్దార్ సంఘం జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్నారు అలాగే వివిధ మండలాలలో తాసిల్దార్ గా పని చేసినారు స్వగ్రామమైన పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలం ముత్తారం( ధర్మపాదు) గ్రామంలో ఈరోజు అంతక్రియలు జరిగినవి జమ్మికుంట నుండి రెవెన్యూ సిబ్బంది అలాగే వివిధ మండలాల నుండి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్‌గా షేక్ సైదా .. టీజేఏ ఆధ్వర్యంలో ఘన సన్మానం.



**సూర్యాపేట, నేటిధాత్రి:** సూర్యాపేట జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జర్నలిస్ట్ షేక్ సైదా ను సోమవారం జర్నలిస్టులు టీజేఏ యూనియన్ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీజేఏ సూర్యాపేట జిల్లా కోశాధికారి కొత్తపల్లి మధు సూధన్ మాట్లాడుతూ. తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యూనియన్ తరపున సూర్యాపేటజిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా అవకాశం రావడం గర్వకారణమన్నారు. కమిటీ సభ్యునిగా ఉండేందుకు అతనికి అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. అర్హులైన జర్నలిస్టుల హక్కుల కోసం యూనియన్ తరపున నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. జర్నలిస్టు యొక్క హక్కులు కాపాడుటకు తన వంతు కృషి చేయాలన్నారు. జర్నలిస్టులకు బస్సు పాస్ లు పూర్వం మాదిరిగానే కొనసాగేందుకు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులందరూ ప్రయత్నం చేయాలన్నారు. (టీజేఏ) యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు రెండు పడకల గదులు లేదా ఇంటి స్థలం రైల్వే పాస్ పునరుద్ధరణ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొల్లోజు నాగేంద్ర చారి, గోరంట్ల శ్రీనివాస్, భయ్యారపు రవీంద్ర, కొండమీది నరసింహారావు, మిద్దె రాకేష్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల బెనిఫిట్ లపై సర్కారు శీత కన్ను

▶▶పెండింగ్ బెనిఫిట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి.... ▶▶ట్రెంగ హనుమకొండ జిల్లా అధ్యక్షులు మరుపట్ల మల్లయ్య డిమాండ్....



**ఐనవోలు, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్‌సీ, జీపీఎఫ్ లోన్లు, పదవీ విరమణ బెనిఫిట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఈహెచ్ఎస్ కింద కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలని, సీపీఎస్ రద్దు చేసి జీపీఎఫ్ విధానం అమలు చేయాలని, జీఓ 317 ప్రకారం బదిలీలను సరిచేయాలని కోరారు. అలాగే రెవెన్యూ శాఖలో పదోన్నతులు, గ్రామ రెవెన్యూ సహాయకుల నియామకాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 17న భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ట్రెంగ్ సంఘం పిలుపునిచ్చింది. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు.

# మున్సిపల్ పార్కులో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ - జగన్నాదం...

▶▶ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ 40 వ వార్షికోత్సవం....



**తిరుపతి, నేటిధాత్రి:** స్థానిక మున్సిపల్ పార్కులో మజ్జిగ ప్యాకెట్లను వాకర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మరియు మూగజీవుల ప్రేమికుడు శ్రీ వారి భక్తులు జగన్నాథం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ 40వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక కపిల్ తీర్థం మార్గంలో గల మున్సిపల్ పార్కులో జగన్నాథం ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోవింద దీక్ష వెల్ఫేర్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు ప్రబోధానంద స్వామి, ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఆర్కాడ్ కృష్ణ ప్రసాద్, శాంతి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్లు మాట్లాడుతూ ఎండలు మెండుగా కాస్తున్న సందర్భంగా వా కర్స్ కు మరియు కుటుంబ సభ్యులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది, అలాగే వాకర్ సభ్యులు మరియు దాతలు ప్రతిరోజు పార్కులో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు.
ప్రబోధానంద స్వామి మాట్లాడుతూ అక్షయ తృతీయ రోజున మజ్జిగ గానీ పెరుగన్నం గాని ఇతరులకు పంచడం మంచిదని జగన్నాథంకు సూచించానని అందుకే ఈ కార్యక్రమంలో నిర్వహించారని, తెలిపారు. ఈ సందర్భంగా మూగజీవుల ప్రేమికుడు జగన్నాథం మాట్లాడుతూ ఈరోజు పార్కులో మజ్జిగపుంచడం మా అదృష్ట భావిస్తూ , మండుతున్న ఎండలకు మానవులు మనమే తట్టుకోలేని పరిస్థితిలో ఉన్నాము. మూగజీవులకు మన వంతు సహాయంగా మన గుమ్మం ముందు గాని, మన పిట్టగోడ పైన గాని, పెరటి ముందుగాని వీధిలో మనకు అందుబాటులో ఉన్నచోట గోవులకు,కుక్కలకు, పక్షులకు గాని నీళ్లు పెట్టి వాటి దాహార్తిని తీర్చితే పుణ్యం కలుగుతుందని వీలైనంతవరకు మన ఇంట్లో ఉన్న తినుబండారాలను అన్నం వంటి వాటిని వృధా చేయకుండా మూగజీవులకు ప్రతిరోజు పెట్టండి అదే మనకు ఆనందాన్ని అదృష్టాన్ని కలగజేస్తుందనీ దీనిని తప్పకుండా ఆచరించగలరని కోరుతున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపి, సెక్రటరీ మస్తాన్ , ఉపాధ్యక్షులు జగన్నాథం,డి. గురునాథం,కె. ఈశ్వర్ రెడ్డి, పి. బలరాం రెడ్డి, కొత్తపల్లి మునిరత్నం , ఆర్.మధు, సుదర్శన్ శెట్టి, మరియు వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష సెక్రటరీలు సాంబశివారెడ్డి, సుబ్బారావు, రోహిత్ బాబు, సురేష్ రెడ్డి అంజి, తదితరులు పాల్గొన్నారు...

# ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన



▶▶ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు..

**చిత్తూరు, నేటిధాత్రి:** నిత్య కృషీవలుడు, నవ్యాంధ్ర సాధనలు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కేక్ కట్ చేసి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. చంద్రబాబు దూరదృష్టి, ప్రజల సంక్షేమం కోసం ఆయన పడే తపన అభినందనీయమని, ఆయన ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని, రాష్ట్ర అభివృద్ధికి మరింత సేవలందించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో టిటిడి నాయకులు రాజశేఖర్ నాయుడు,సోమశేఖర్ నాయుడు వాసు నాయుడు, గందమనేని నరేష్, బిజెపి చిన్నగొట్టిగల్లు మండలాధ్యక్షులు దండు కిషోర్ కుమార్ సింగిల్ విండో చైర్మన్ మత్తుం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# మా భూమిని సర్వే చేయించి మాకు న్యాయం చేయండి...



▶▶ భూ బాధితుడు ఈ ఎస్ నారాయణశెట్టి..

**తిరుపతి, నేటిధాత్రి:** నగిరి మండలం దామరపాకం గ్రామ లెక్క దాఖలాలో గల సర్వే నెంబరు 69 బార్ 12 భూ సమస్యపై రెవెన్యూ అధికారులు మా భూమిని సర్వే చేసి మాకు ఇవ్వగలరని పత్రికా ముఖంగా తెలియజేస్తున్నామని ఇ.ఎస్ నారాయణ శెట్టి కోరుతున్నామన్నారు . సోమవారం స్థానిక ప్రెస్క్లబ్లో విలేకరి సమావేశంలో ఆయన మాట్లాడుతూ దామరపాకం గ్రామ లెక్క దాఖలాలలో గల సర్వేనెంబర్ 69/12 లో వున్నభూమి 31 సెంట్లు మాత్రమేనాని ఈ భూమిలో మా అబ్బాయి సుబ్రహ్మణ్యం శెట్టి 0.15.1/2, పద్దహైదున్నార సెంట్లు వాటా వచ్చాయని అలాగే మా అత్త నాగభూషణం కి 0.15 1/2 పద్దహైదున్నార సెంట్లు వాటా వచ్చాయి. మా బాబాయి ఘనపతి శెట్టి మరియు ఆయన కుమారుడు జీ. లీలారామ్ ఇరువురు ఈ సర్వేనంబరపై తప్పుగా 0.51సెంట్ల భూమి అని దస్తావేజులలో తప్పుగా రాసివుంచుకున్నారని ఆక్రమంగా 0.20 సెంట్లు భూమి ఉందంటున్నారు మీ ద్వారా నెంబర్ 105 సర్వే నెంబర్లు 69/12 గల భూమిని సంబంధిత అధికారులచే సర్వే చేయించి మాకు న్యాయం చేయవలసినదిగా కోరుతున్నామన్నారు . ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు...

# హెచ్ పి వి వ్యాక్సిన్ ను సద్వినియోగం చేసుకోవాలి సర్పంచ్ నాగయ్య.



**కోదాడ, నేటిధాత్రి:** 15 సంవత్సరాల పిల్లలు హెచ్ పి వి వ్యాక్సిన్ ను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మందుల నాగయ్య అన్నారు. సోమవారం కోదాడ మండలం గుడిబండ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం నందు గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య ఆధ్వర్యంలో 15 ఏళ్ల వయస్సు గల బాలికలకు (హెచ్ పి వి) వ్యాక్సిన్ ను వేయించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ ను నివారించడానికి 14 ఏళ్ల వయసుగల బాలికలకు హెచ్పివి వ్యాక్సిన్ ను ఉచితంగా అందించి క్యాన్సర్కు కారణం అయ్యే హెచ్ పివి వైరస్ నుండి ఈ వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుంది. ఈ వ్యాధిని నివారించడానికి హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకోవడం చాలా ముఖ్యం. ఈ వ్యాక్సిన్ ను 15 ఏళ్ల పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, జిపిఓ ఈశ్వర్, ఏఎన్ఎం. చంద్రకళ, సూపర్వైజర్ విజయ్, ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు బాలికలు తదితరులు ఉన్నారు.

# ఆత్మకూరులో సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

**పరకాల, నేటిధాత్రి:** నియోజకవర్గం ఆత్మకూరు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి,పండ్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమం మండలాధ్యక్షుడు మరుగిద్దె రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా నియోజకవర్గ బాధ్యులు కందుకూరి నరేశ్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుకల్లో పలువురు స్థానికనాయకులు,కార్యకర్తలుపాల్గొన్నారు. వారిలో మండల నాయకులు, యువజన ప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు కందుకూరి నరేష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఐటీ రంగ అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల విస్తరణ, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ఆయన పాత్ర విశేషమని నరేష్ పేర్కొన్నారు. ఆయన దూరదృష్టి,పరిపాలనా నైపుణ్యం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించిందని అన్నారు. చివరగా, ముఖ్యమంత్రి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం కలగాలని కోరుతూ పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# డీలిమినేషన్ లాగానే..బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడండి

▶▶ జనగణనలో బీసీ కులగణన జరిగేలా ప్రధాని మోడీపై ఒత్తిడి పెంచాలి



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** డీలిమిటేషన్ పై ఇండియా కూటమిని ఏకం చేసి పార్లమెంట్ లో ఏ విధంగా పోరాడారో..బీసీ డిమాండ్లపై కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి బీసీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపు..ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో బీసీ కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. 2026 జనాభా లెక్కలు పూర్తికాకుండానే..131వ రాజ్యాంగ సవరణ పేరుతో మహిళా రిజర్వేషన్ల అమలు, డీలిమిటేషన్ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనను అడ్డుకోవడం శుభ పరిణామం అన్నారు. ఇదే స్ఫూర్తితో..సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేసేలా, తెలంగాణలో చేసిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్ లో ఆమోదించే విధంగా, దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో బీసీ కులాలను లెక్కించే విధంగా కేంద్రంతో పోరాడాలన్నారు. ఈ విషయంలో మొత్తం బీసీ సమాజం కాంగ్రెస్ వెంట నడుస్తుందన్నారు.

# దేశాయిపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహ ప్రవేశాలు.



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు గృహాలకు ఈరోజు గృహప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన అనేక.సంక్షేమ పథకాల్లో భాగంగా ఇందిరమ్మగృహ పథకం ఒకటని అందులో భాగంగా ఈరోజు దేశాయిపల్లి గ్రామంలో .లబ్ధిదారులైన ముగ్గురికి గృహ.ప్రవేశాలు నిర్వహించడం జరిగిందని తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్రంలో పేదల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ నిరుపేద సొంతింటి కల నెరవేర్చే దిశగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం తీసుకొచ్చి రాష్ట్రంలో ఇండ్లు లేని వారు ఉండాలని ఉద్దేశంతో రాష్ట్ర నిరుపేద ప్రజలకు. ఎంతో అండగా ఉంటుందని తెలియజేస్తూ. ప్రభుత్వం ఇందిరమ్మ.పథకంలో ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులు ప్రభుత్వం గృహ నిర్మాణానికి ఇస్తున్న ప్రభుత్వ ఆర్థిక సాయం తీసుకుని సకాలంలో ఇల్లు నిర్మించుకోవాలని ఈ సందర్భంగా తెలియజేస్తూ. సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి పంపిన చిరు.కానుకను పట్టు వస్త్రాలను లబ్ధిదారులకు నాయకులు ఆధ్వర్యంలో అందజేయడం జరిగిందని సందర్భంగా తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్. తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జలగం ప్రవీణ్. సర్పంచులు సుధాకర్. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొన్నాల పరుశురాం.ఆరేపల్లి బాలు. మండల ఉపాధ్యక్షులు గుగ్గిళ్ళ శ్రీకాంత్ గౌడ్. యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగలరాజు. రాజిరెడ్డి. శ్రీరామ్. శ్రీనివాస్. లింగారెడ్డి. తిరుపతి. రమేష్. శ్రీనివాస్. కొత్త రవి. మల్లేశం. సిరిసిల్ల దేవయ్య. ఇందిరా కమిటీ సభ్యులు లబ్ధిదారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ పాల డేయిరి ఆధ్వర్యంలో పుస్తె మట్టెలు అందజేత....



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం దేశాయి పల్లె గ్రామంలో. పెళ్లి జరుగుతున్న కుటుంబానికి పుస్తె.మట్టలు అందజేసిన. అందజేసిన కరీంనగర్ డేయిరిపాలకేంద్రం. ఈ సందర్భంగా. నేరెళ్ల రూట్ సూపర్వైజర్ ఉమ్మారెడ్డి భానుచందర్ రెడ్డి మాట్లాడుతూ. కరీంనగర్ పాల డైరీ కేంద్రం ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని అందులో భాగంగానే కళ్యాణమస్తు పథకం చేపట్టిందని దానిలో భాగంగా ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం దేశాయి పల్లె గ్రామంలోని పాడి రైతు పెండ్యాల దేవి రెడ్డి. జయ.ల కూతురు. రమ్య వివాహానికి. ఆడబిడ్డ పెళ్లికి కరీంనగర్.డేయిరీ. పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పుస్తె మట్టలు అందజేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో. దేశాయి పల్లె పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు గట్టు లక్ష్మారెడ్డి. డైరెక్టర్లు మరియు సెక్రటరీ గోపన్న గారి హరీష్. కుటుంబ సభ్యులు పాల ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

▶▶ డాక్టర్ మనోజ్ నర్సింగ్ సూపర్డెంట్.



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల మండల కేంద్రంలో సోమవారం రోజున స్థానిక హాస్పెటల్ సూపరిండెంట్ ఆదేశాల మేరకు జాతీయ ఉపాధి హామీ కూలీలకు ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి డాక్టర్ మనోజ్. నర్సింగ్ సూపరిండెంట్ సరోజిని మేడం. నర్సింగ్ ఆఫీసర్ శిరీష (ఐ సి ఎన్) . ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీలను ఉద్దేశించి పొద్దున 6 గంటల నుండి 10 గంటల వరకే పని చేయాలి. సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు మాత్రమే పని చేయాలి. తలపై టవలు కట్టుకోవాలి. ఎక్కువ మోతాదులో వాటర్ తాగాలి. కొబ్బరి నీళ్లు. మజ్జిగ. నిమ్మరసం. తీసుకోవాలి. కిరాణం షాపులో మెడికల్ షాప్ లో డబ్బాలో దొరికే ఓ ఆర్ ఎస్ కాకుండా ప్యాకెట్ లో వచ్చే ఓ ఆర్ ఎస్ వాడాలని తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మాట్లాడడం జరిగింది అనంతరం ORS ప్యాకెట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది కట్కూరి నరేందర్. కిరణ్. కారోబార్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

# టి పి టి ఎఫ్ నేతకు ఘనంగా పదవి విరమణ అభినందన సన్మానం



**కేసముద్రం, నేటిధాత్రి:** సోమవారం జిల్లా పరిషత్ పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం విలేజ్ లో బయాలజీ స్కూల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న చీకటి వెంకట్రాం నర్సయ్య పదవీ విరమణ అభినందన, సన్మాన సమావేశం పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మహబూబాబాద్ జిల్లా మరియు కేసముద్రం మండల శాఖలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు బాలాష్టి రమేష్ మాట్లాడుతూ సుమారు 40 సంవత్సరాలపాటు విద్యార్థులకు అంకితభావంతో సేవలందించిన ఉపాధ్యాయులు చీకటి వెంకట్రాం నర్సయ్యా అని, క్రమశిక్షణ, నిబద్ధత గల వ్యక్తి అని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో మాత్రమే కాకుండా, ఉపాధ్యాయ సంఘమైన టి పి టి ఎఫ్ (తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) లో కూడా క్రియాశీల కార్యకర్తగా పని చేశారని, సంఘ నిర్మాణంలో చురుకుగా పాల్గొంటూ, పలుమార్లు మండల అధ్యక్షునిగా, జిల్లా శాఖ ఉపాధ్యక్షునిగా సేవలందించి, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు తన వంతు కృషి చేశారన్నారు. ఈ సందర్భంగారిటైర్మెంట్ రోజునే రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించే విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయులు నాగమణి, శ్రీనివాస్ రమేష్, సుధాకర్, శిరీష, పద్మ, లతో పాటు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కార్యదర్శి మైస శ్రీనివాసులు కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ప్రధాన కార్యదర్శి నరసింహ రాజు, , జిల్లా కార్యదర్శులు రాచకొండ ఉపేందర్, చీకటి ఉపేందర్, మండల శాఖ ఉపాధ్యక్షులు అంజన్న కార్యదర్శులు వీసం నర్సయ్య, ఊటుకూరి ప్రణయ్ కుమార్, మోహన కృష్ణ, కోడెం శ్రీనివాస్, మండల శాఖ ,అప్పాల నాగరాజులు పాల్గొన్నారు.

# పిల్లలకు ఒత్తిడి లేని విద్యనందించాలి.



▶▶ ప్రైవేట్ స్కూల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సతీమణి రేణుకా రెడ్డి...

**పలమనేరు, నేటిధాత్రి:** ప్రస్తుత విద్యా విధానంలో పిల్లలపై తీవ్రమైన ఒత్తిడి ఉందని, దీనివల్ల పిల్లలు డిప్రెషన్కు లోనవుతున్నారని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి సతీమణి రేణుకా రెడ్డి పేర్కొన్నారు. గంగవరం మండలంలో ఫ్రీ ఆన్ ఫ్యూచర్ ప్రైవేట్ పాఠశాల ప్రారంభోత్సవానికి సోమవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పూజలు నిర్వహించిన అనంతరం పాఠశాలను ప్రారంభించారు. వినూత్నమైన ప్లే-బేస్డ్ ఎర్లీ ఎడ్యుకేషన్ స్కూల్ను ప్రారంభించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఆటల ద్వారా సాగే ఈ విద్యా విధానం పిల్లల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, శారీరక మరియు మానసిక ఎదుగుదల, సోషల్ స్కిల్స్ మరియు సృజనాత్మకతను పెంపొందించడానికి సహాయపడుతుందని ఆమె వివరించారు. ఈ విధానం వల్ల పిల్లలు ఆత్మవిశ్వాసంతో పెరుగుతారని, భవిష్యత్తులో వారికి ఎటువంటి అలవాట్లు లేకుండా మంచి పౌరులుగా ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నూతన విద్యా విధానాన్ని అర్థం చేసుకుని, తల్లిదండ్రులు కూడా సహకరించాలని ఆమె కోరారు. అనంతరం ?పాఠశాల నిర్వాహకురాలు మౌనికకు మరియు ఆమె బృందానికి అభినందనలు ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు, గంగవరం, బైరెడ్డి పల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీపాండు రంగ విఠలేశ్వర్ ఆలయంలోకి ధ్వజస్తంభ ప్రతిష్ట



**వనపర్తి, నేటిధాత్రి:** వనపర్తి బ్రాహ్మణ వీధిలో శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయం లో ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగిందని ఆలయ కమిటీ అధ్యక్షులు పూరి పాండు కమిటీ సభ్యులు పాపిశెట్టి శ్రీనివాసులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బండారు కృష్ణ జగదీష్ ఆలయపురోహితులు రామకృష్ణ తెలిపారు పూజలు అన్నప్రసాదం భక్తులకు పంపిణీ చేశామని వారు పేర్కొన్నారు పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని వారు తెలిపారు

# ఎ పి సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



**వనపర్తి, నేటిధాత్రి:** వనపర్తి జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు. 76వ జన్మదిన వేడుకలు పారి నేతలు ఘన శీ గా జరుపుకున్నారు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు ఈ వేడుకల సందర్భంగా నాగర్ కర్నూల్ పార్లమెంటు కన్వీనర్ బి రాములు మాట్లాడుతూ నిరంతర శ్రామికుడు, అలుపెరుగని యోధుడు, నిత్య కృషివలుడు ,సైబరాబాద్ సృష్టికర్త, పేదల పెన్నిధి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు వనపర్తి జిల్లా తెలుగుదేశం వనపర్తి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు కే లక్ష్మయ్య న్యాయ వాది షాకీర్ హుస్సేన్ శ్రీను ట్రాక్టర్ బాలయ్య, హోటల్ బలరాం ,ఏ చిన్నయ్య ,మేదరి బాలయ్య, హుస్సేన్ బి శేఖర్ ,శివయ్య చారి, చీర్ల గోవర్ధన్ , ఎం డి ఫారుక్ కి గిరి జంగిడి సురేష్, కొత్తగోళ్ల శంకర్ డి బాలరాజు తదితరులు పాల్గొన్నారు

# కొత్త హైవే పనుల్లో స్వల్ప అంతరాయం



**పరకాల, నేటిధాత్రి:** మల్లక్కపేట గ్రామ సమీపంలో బోర్లపడ్డ మొరం వాహనం పరకాల పరిధిలో కొత్తగా కొనసాగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనుల మధ్య మల్లక్కపేట గ్రామ సమీపంలో ఒక స్వల్ప ఘటన చోటుచేసుకుంది. మొరం (మట్టి) లోడుతో వెళ్తున్న ఒక వాహనం అదుపు తప్పి రోడ్డుపై బోర్లపడింది. ఈ ఘటనతో అక్కడ జరుగుతున్న హైవే పనులకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. వాహనం బోర్లపడటంతో రోడ్డుపై కొంత మొరం చెల్లాచెదురుగా పడిపోవడంతో వాహనాల రాకపోకలు కొద్దిసేపు మందగించాయి. అయితే ఎటువంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగలేదు. పరిస్థితి త్వరలోనే సాధారణ స్థితికి చేరుకుని, వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగాయి. హైవే నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

